క్లుప్తంగా

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వేపాడ: మండలంలోని బోజంకివానిపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో గాలికుంటు వ్యాధి నివారాణ టీకాలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించారు. వేపాడ పశువైద్యాధికారిణి డా. గాయిత్రీ నేతృత్వంలో పశువులకు తనిఖీలు నిర్వహించిన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. పశుగ్రాసం పెంపకం తద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. సర్పంచ్ బి.రామునాయుడు, పశువైద్య సిబ్బంది కృష్ణ, సింహాద్రప్పడు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా కనకమహాలక్ష్మి



సరస్వతీ దేవి అలంకరణలో కనకమహాలక్ష్మి, మానసాదేవి నాగశక్తి

చీపురుపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి, రామలింగాపురంలోని మానసాదేవి నాగశక్తి అమ్మవారికి భక్తులు సోమవారం ప్రత్యేకపూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యూరియా పంపిణీని పరిశీలించిన ఆర్‌డీవో



యూరియా పంపిణీ వివరాలను ఏడీఏను అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డీవో

గుర్ల: జమ్ము ఆర్ఎస్‌కే వద్ద అధికారులు సోమవారం యూరియా పంపిణీ చేపట్టారు. యూరియా పంపిణీలలో తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న సీఐ శంకరరావు, ఎస్‌ఐ నారాయణరావు, పోలీసు సిబ్బంది చేరుకొని తోపులాటలు లేకుండా చర్యలు చేపట్టారు. యూరియా పంపిణీని ఆర్‌డీవో ఆశయ్య, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి పరిశీలించారు. వన్ బీ ఉన్న రైతుకు ఒక బస్తా యూరియా పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశించారు. కొందరు రైతులకు యూరియా బస్తా దొరక్కపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు.

డ్వామా పీడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గంట్యాడ: జిల్లా నీటి యాజయాన్య సంస్థ (డ్వామా) పీడీ శారదాదేవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గంట్యాడ మండలం పెదవేమలి గ్రామ సర్పంచ్ వర్రి పాపునాయుడు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పెదవేమలి క్షేత్ర సహాయకుడు నియమ నిబంధనలకు విరుద్ధంగా పని చేసినప్పటికీ డబ్బులు విషయం లేదు కనుక అతనిపై చర్యలు తీసుకోలేమని పీడీ చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీడీవో, ఏపీవో ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ జరిపి నిబంధనలకు వ్యతిరేకంగా పని చేశారని పీడీకి నివేదిక కూడా పంపించారని తెలిపారు.

పని గంటల పెంపు ఉపసంహరించుకోవాలి..



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సుధారాణి

జామి: పనిగంటల పెంపు తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.సుధారాణి, పలువురు నేతలు డిమాండ్ చేశారు. జామిలో సీఐటీయూ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయలన్నారు. గతంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న ఎటువంటి హామీలు నెరవేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా 8గంటల పనిదినాన్ని 10 నుంచి 12 గంటలకు పెంచుతూ మహిళలతో రాత్రి సమయంలో పని చేయించుకునే విధంగా అసెంబ్లీలో చట్ట సవరణ చేశారని తక్షణమే దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. కార్మికులందరికి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయలన్నారు. జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహనరావు, వ్యవసాయ కార్మి క సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.ముత్యాలు, సీఐటీయూ నేతలు కనకమహలక్ష్మీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలకు డిజిటల్ బుక్‌తో అడ్డుకట్ట

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు తదితరులు

కొత్తవలస:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, వేధింపులకు గురి చేస్తున్నారని వీటిని ఎదుర్కొనేందుకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం గ్రామం సమీపంలో గల మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబుతో కలిసి డిజిటల్ బుక్, యాప్‌లను పార్టీ శ్రేణుల సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు, కిడ్నాప్‌లు, దాడులు ఎక్కువైపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ పార్టీకి చెందిన గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలకు జరిగిన అన్యాయాలను ఈ యాప్ ద్వారా డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్యాయానికి గురైన ప్రతీ ఒక్కరికి న్యాయం జరుగుతుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని తెలిపారు. రాజధాని పేరుతో రాష్ట్రంలో అతిపెద్ద ధన దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఇటీవల శాసనసభలో సినీ నటుడు బాలకృష్ణ మాటల తీరు తీవ్ర అభ్యంతరకరంగా వున్నాయని దుయ్యబట్టారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. శాసన సభలో మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, నీలంశెట్టి గోపెమ్మ, దొగ్గ సత్యవంతుడు, సబ్బవరపు అరుణ, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, ముమ్మలూరి జగన్నాథం, మోపాడ కుమార్, పార్టీ నాయుకులు బొంతల వెంకటరావు, మదీన అప్పలరమణ, పల్లా భీష్మ, పి.ఎస్.ఎ.పాత్రుడు, వెంకన్నపాత్రుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి అరాచక పాలన



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నరసింహమూర్తి

గంట్యాడ: రాష్ట్రంలో కూటమి అరాచక పాలన సాగుతుందని ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ వాల్‌పోస్టర్లను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులకు ఎవరూ భయపడొద్దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో దుర్మార్గమైన పాలన సాగిస్తుందన్నారు. పోలీసులను తమ చేతుల్లో పెట్టుకుని అన్యాయంగా కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, కిలపర్తి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరులో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు రక్షణగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులరే రక్షణగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రారంభించారని ఆ పార్టీమండల అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు అన్నారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై అకారణంగా కూటమి ప్రభుత్వం కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. దసరా తర్వాత గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు డిజిటల్ బుక్‌పై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, నాయకులు మహంతి రమణ, సాలాపు పెంటం నాయుడు, పల్లి రఘు, తాడ్డి చందు, తాళ్లపూడి అప్పలనాయుడు, మూకల చలంనాయుడు, సిరిపురం ఆదినారాయణ, మునకాల పైడిపు నాయుడు, మండల రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గజపతినగరం: వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించినట్టు బూడి చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అని పేరు చెప్పుకొని ఎటువంటి పథకాలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను, నిరుద్యోగులను, ఉద్యోగులను, విద్యార్థులను చంద్రబాబు మోసం చేశారన్నారు. కార్యక్రమంలో తుమికాపల్లి గ్రామ సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, శీర వెంకటరమణ, ఉజ్జూరు శ్రీనివాసరావు, తాతినాయుడు, లోగిశ శ్రీను, లక్ష్మునాయుడు, తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

దత్తిరాజేరు: ఎన్నికల వేళ కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున ధ్వజమెత్తారు. దత్తిరాజేరులో మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు నివాసం వద్ద డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ వాల్‌పోస్టర్‌ను వైస్ ఎంపీపీ గేదెల మిత్తిరెడ్డి రమేష్, యువజన అధ్యక్షుడు దత్తి చిరంజీవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీనుతో కలిసి సోమవారం విడుదల చేశారు. కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేస్తే పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

జిందాల్ నిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: వంద రోజులు పాటూ నిరసన దీక్షలు చేసిన జిందాల్ నిర్వాసితులు ప్రభుత్వం తమ గోడు వినకపోవటంతో తమ ఉద్యమ పంథా మార్చుకున్నారు. సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్టు ప్రకటించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ రఘురాజు నివాసం వద్ద నిర్వాసితులు రిలే నిరాహార దీక్షలకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ రాష్ట్రంలో గుడ్డి సర్కారు నడుస్తోందని, వందల సంఖ్యలో గిరిజనులు తమ భూములు, ఉపాధి కోల్పోయి రోడ్డున పడి ఏడుస్తున్నా కంపెనీలకు ఒత్తాసు పలుకుతున్నారే తప్ప రైతులు ఎందుకు రోడ్డుమీదకి వచ్చారన్న ఆలోచన చేయటం లేదని ధ్వజమెత్తారు. రైతులు ఉసురు పోసుకున్న ప్రభుత్వాలు పతనం కాక తప్పదని, శాపనార్థాలు పెట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమపై సానుభూతి చూపాలని డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సచివాలయం ఉద్యోగులు

కొత్తవలస: గ్రామ సచివాలయం ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగిస్తామన్నారు. పనికి మించిన భారం మోపుతున్నారని, తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని, ప్రమోషన్‌లు కల్పించడం లేదని వాపోయారు. ప్రతీ రోజు ప్రభుత్వం తీరును నిరసిస్తు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతున్నట్టు తెలిపారు. ఒకటో తేదీన పింఛన్ ఇచ్చే సమయంలో తమ నిరసనను ఉద్రిక్తతం చేసి ప్రజలకు వివరిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో రమణయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామసభకు అడ్డుకట్ట



పెదఖండేపల్లిలో గ్రామసభ కోసం కూర్చున్న ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ తదితరులు

- పోలీసుల అదుపులో సర్పంచ్
- హోం మంత్రి అనిత జోక్యంతో సద్దుమణిగిన వివాదం

శృంగవరపుకోట: జిందాల్ సేకరించిన భూముల్లో ప్రభుత్వం ఎం.ఎస్.ఎం.ఇ పార్కు ఏర్పాటు చేసే యోచనలో ఉన్న విషయం విదితమే. కాగా గత 100 రోజులుగా జిందాల్ నిర్వాసితులు ఎం.ఎస్.ఎం.ఇ పార్కులు వద్దు.. జిందాల్ తమ నుంచి తీసుకున్న భూములు తమకే ఇవ్వాలన్న నినాదంతో ఉద్యమాలు చేస్తున్నారు. ఈ తరుణంలో ఎం.ఎస్.ఎం.ఇ పార్కుల వల్ల పర్యావరణ సమస్యలు, నీటి సమస్యలు తలెత్తుతాయని వాటి ఏర్పాటును వ్యతిరేకిస్తూ జిందాల్ భూములున్న నాలుగు పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మానాలు చేయాలని ఎమ్మెల్సీ రఘురాజు సూచించారు. ఈ పనికి కొందరు సర్పంచ్‌లు ఓకే అన్నారు. దీనిలో భాగంగా సోమవారం పెదఖండేపల్లి సర్పంచ్ యాళ్ల వెంకటరమణ నేతృత్వంలో గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. అదే సమయంలో ఎటువంటి గ్రామసభలు వద్దని కలెక్టర్, డీపీవోల నుంచి మౌఖిక ఆదేశాలు రావటంతో గ్రామ కార్యదర్శి వీరునాయుడు గైర్హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ గ్రామసభకు ఉపక్రమించిందే తడవుగా ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి తన సిబ్బందితో వచ్చి సర్పంచ్ యాళ్ల వెంకటరమణను అదుపులోకి తీసుకుని ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు అంతా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు వారంతా ఒక్కటిగా గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపుతామని సిద్ధమయ్యారు. కాగా విషయం ఇంటిలిజెన్స్ ద్వారా తెలుసుకున్న రాష్ట్ర హోంమంత్రి అనిత ఎమ్మెల్సీ రఘురాజుకు ఫోన్ చేసి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని, సంయమనం పాటించాలని సర్ది చెప్పి, సర్పంచ్ విషయమై తాను ఎస్పీతో మాట్లాడతానంటూ హామీ ఇవ్వటంతో రఘురాజు వర్గీయులు వెనక్కి తగ్గారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో సర్పంచ్ యాళ్ల వెంకటరమణను ఎస్.కోట పోలీసులు విడిచిపెట్టారు. మొత్తంగా ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకూ గ్రామంలో పోలీసులు, ఇటు పెద్దలు, గ్రామానికి చెందిన మరికొందరు యువత, సచివాలయ ఉద్యోగులు మొహరించటంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.

వేడుకగా సరస్వతీ దేవి పూజలు



ఎస్.కోట దేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు



కొత్తవలస : లక్కవరపుకోటలో సరస్వతీదేవి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు



బొండపల్లి: రాజరాజేశ్వరిదేవి ఆలయంలో సామూహిక అక్షరాభాస్యాలను నిర్వహిస్తున్న అర్చకులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పూజలు నిర్వహించారు. పలు చోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జామి: అలమండలో సరస్వతీ దేవిగా అమ్మవారి దర్శనం



దత్తిరాజేరు: పెదమానాపురంలో దుర్గాదేవి మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



వేపాడ: బానాదిలో జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

పౌష్టికాహార మాసోత్సవాలు

గజపతినగరం: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అధికంగా తీసుకోవాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుష్మా సూచించారు. మండలం వేమలి గ్రామంలో ఐసీడీఎస్ సిబ్బంది నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో ఆమె సోమవారం పాల్గొని సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ పుష్పాంజలి, వేమలి గ్రామ సర్పంచ్ కోరాడ సావిత్రి పాల్గొన్నారు.

సరదాగా బాణాల పండగ



బాణాలతో విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస ప్రాథమిక పాఠశాలలో సోమవారం శోధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాణాల పండగను ఘనంగా నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురష్కరించుకొని శోధన సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ఈ బాణాల పండగను నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థ్ధులతో సరస్వతీ పూజను చేయించారు. అనంతరం విద్యార్థులతో బాణాలు పట్టుకొని గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ సరస్వతీదేవి, చదువుల తల్లికి సంబంధించిన పాటలను ఆలపించారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, శోధన కోఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ, ఎం.రామకృష్ణ, ఉపాధ్యాయులు, శోధన వలంటీర్లు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: బాడాం, గోపన్నవలస బాలబడుల చిన్నారులు దసరా బాణాలతో సోమవారం వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు. పాత కాలపు నాటి దసరా పాటలను పాడుతూ సరదాగా గడిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: బాణాలతో తిరుగుతున్న చిన్నారులు